క్లుప్తంగా

18న మండల సర్వసభ్య సమావేశం

సిద్దవటం : సిద్దవటం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 18న జరుగనున్నట్టు ఎంపీడీఓ ఉమామహేశ్వరావు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సభా భవనంలో ఎంపీపీ (మండలాధ్యక్షురాలు) జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన జరుగుతుందన్నారు. సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధి పనులపై చర్చ ఉంటుందన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన అన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలని ఎంపీడీఓ కోరారు. చట్టరీత్యా మండల సమావేశం నిర్వహించవలసి ఉన్నందున ఎలాంటి తీర్మానాలు ఆమోదం పొందవని ఎంపీడీఓ తెలియజేశారు.

గాలివీడు 81 శాతం పోలింగ్

గాలివీడు : మండల వ్యాప్తంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 81 శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మండలంలోని మొత్తం 40,229 మంది ఓటర్లు ఉండగా 32,809 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. అందులో మహిళలు 16,585, పురుషులు 16,224 మంది తమ ఓటును వేశారు. గ్రామాల వారీగా పోలైన ఓట్లు వివరాలు ఇలా.. అరవీడు 83 శాతం, గాలివీడు 77 శాతం, గోరాన్‌చెరువు 84 శాతం, ఎగువగొట్టివీడు 87 శాతం, తలముడిపి 84 శాతం, కొర్లకుంట 84 శాతం, తూముకుంట 83 శాతం, గుండ్లచెరువు 82 శాతం, గరుగుపల్లె 85 శాతం, పేరంపల్లె 86 శాతం, వెలిగల్లు 88 శాతం, గోపనపల్లె 84 శాతం, నూలివీడు 76 శాతం, సీసీపల్లె 84 శాతం, పందికుంట 84 శాతం, పూలికుంట 88 శాతం, బోరెడ్డిగారిపల్లె 79 శాతం ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు.

21న మర్రిచెట్టు లక్ష్మీ నరసింహుడి కల్యాణోత్సవం

లక్కిరెడ్డిపల్లె : ఈ నెల 21న కుర్నూతల క్రాస్ రోడ్డు మర్రిచెట్టు వద్ద వెలసిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించ తలపెట్టినట్లు ఆలయ అర్చకులు వెంకటనారాయణ శాస్త్రి, ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. బుధవారం లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవ కార్యక్రమ లగ్నపత్రికను అర్చకులు సమక్షంలో నిర్వాహకులు రాయించారు. లక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవంను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఈ కల్యాణోత్సవ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మండల ప్రజలు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు. కల్యాణం అనంతరం అన్నప్రసాద వితరణతోపాటు స్వామివారి గ్రామోత్సవం ఉంటుందన్నారు. రాత్రికి సాసవల చిన్నమ్మ కథను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కాలభైరవుడికి పూజలు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపంలోని గుట్టపై వెలసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. బుధవారం స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పట్టువస్త్రాలు, రంగురంగుల పూలతో అందంగా అలంకరించారు. స్వామి వారిని దర్శించుకొనేందుకు స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు కూడా విశేషంగా తరలివచ్చారు.

23వ తేదీ తిరునాల..

ఈనెల 23వ తేదీ కాలభైరవ స్వామి తిరునాల నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ధర్మారెడ్డి, ఆలయ నిర్వాహకులు తెలిపారు. తిరునాల సందర్భంగా ఉదయం నుంచి భక్తులకు అన్నప్రసాదాలు అందించనున్నట్లు చెప్పారు. రాత్రి చాందినీ బండ్లతో మెరవణి ఉంటుందని భక్తులు విశేషంగా పాల్గొనాలని కోరారు.

సర్ ఆర్థర్ కాటన్ జయంతి

వాల్మీకిపురం: అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ జయంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జేవీవీ అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ అతివృష్టి, అనావృష్టితో ఇబ్బంది పడతున్న గోదావరి ప్రాంతాన్ని కాటన్ ధాన్యాగారంగా మార్చారన్నారు. లక్షలాది ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరు అందించారన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బి.కొత్తకోట: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి సలీంబాషా కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్మికుల సంక్షేమ బోర్డును ప్రారంభించాలని కోరారు. పెండింగ్‌లోని క్లయిమ్‌లను విడుదల చేయాలన్నారు. సంఘ నాయకులు బాలకృష్ణ, గఫూర్, తంబయ్యశెట్టి, మస్తాన్, నాసీర్, కుమార్ పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా రాయాలి

తంబళ్లపల్లె: వైఎస్సార్ క్రాంతి పథం మహిళా సంఘ సభ్యులు రికార్డులు సక్రమంగా రాసుకునే విధంగా సీసీలు సహకరించాలని డీజీఎం మల్లయ్య తెలిపారు. బుధవారం స్త్రీ శక్తి భవనంలో సీసీలు, సంఘమిత్రలతో సమావేశం నిర్వహించారు. జమా పద్దుల రికార్డులను పరిశీలించారు. బ్యాంకు రుణాలు పొందిన సభ్యులు నెలవారి చెల్లించే కంతుల రసీదులు భద్రపరుచుకోవాలన్నారు.

పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్లకు కృతజ్ఞతలు

- రాజకీయాలలో విలువలు ముఖ్యం.. ఆచరించడం ఒక బాధ్యత
- రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి


గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎమ్మెల్యే, రాయచోటి

రాయచోటి : రాయచోటి నియోజకవర్గంలో ఓటింగ్‌లో పాల్గొన్న ఓటరు మహాశయులకు వైఎస్సార్‌సీపీ రాయచోటి అసెంబ్లీ అభ్యర్థి గడికోట శ్రీకాంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం రాయచోటిలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో 1,97,463 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. వీరిలో 1,01,031 మంది మహిళలు, 96,426 మంది పురుషులు ఉన్నారన్నారు. సుదూర ప్రాంతాలలోని వారు సైతం ఓటింగ్‌లో పాల్గొనడం సంతోషకరమన్నారు. గంటల తరబడి క్యూలైన్‌లో ఉండి, ఎండను సైతం లెక్కచేయక, రాత్రి 9 గంటల వరకు వేచి ఉండి ఓటింగ్‌ను వినియోగించుకున్నారన్నారు. ఓటుహక్కును వినియోగించుకున్న ప్రతి ఓటరుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా తీర్పు అంతిమమన్నారు. ఈ ఎన్నికలలో అపోహలు సృష్టించి, భయభ్రాంతులకు గురిచేయాలన్న ప్రతిపక్షాల దుశ్చర్యలను ప్రజలు తిప్పికొడతారన్నారు. ఎన్నికలలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేసుకోవడం, తాము ఏమి చేశాం, ఏమి చేయబోతామని ఓటర్లకు చెప్పకోవడం ఒక బాధ్యత అన్నారు. ఇలా కొందరు చేయకపోవడం దురదృష్టకరమన్నారు.

అసత్యాలతో ప్రజల మనస్సులు మార్చాలేరు

ఫేక్ వార్తలు, ఫేక్ వీడియోలు సృష్టించి ఎన్నికల ముందు ప్రజల మనస్సులను మార్చాలన్న ప్రయత్నం ప్రజాస్వామ్యంలో దారుణమన్నారు. ఫేక్ వాట్సప్ చాట్‌ను సృష్టించి మైనార్టీల భావాలు దెబ్బతినే విధంగా నేను అందులో మెసేజ్‌లు పెట్టినట్లుగా ఫేక్ పోస్టులు పెట్టడం చాలా దారుణమన్నారు. ఎన్నికల ముందు నేను వివరణ కూడా ఇవ్వలేదన్నారు. నియోజకవర్గ ప్రజలకు నేను ఇటువంటి పనులు చేయనని, నాపైన నియోజకవర్గ ప్రజలకు నమ్మకం ఉందన్నారు. ఆ చాట్ నాది అని నిరూపిస్తే ఎన్నికల కౌటింగ్‌కు కూడా రానని సవాల్ చేశారు. దమ్ముంటే ఈ ఛాలెంజ్‌ను ప్రచారం చేసిన వారు స్వీకరించాలన్నారు. ఎన్నికల తరువాత ఈ విషయం మాట్లాడుతున్నానంటే ప్రజాస్వామ్యంలో విలువలు ఉండాలన్నారు. నీచమైన, దుర్మార్గాల సంస్కృతితో రాజకీయాలు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. ఎన్నికల ప్రచారంలో ఎన్నో దుష్ప్రచారాలు, మరెన్నో అసభ్య పదజాలంతో దూషించారని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఎన్నికలలో పోటీచేసే వారైనా, ప్రజా సేవ చేయాలనుకున్న ఆలోచనలున్న వారు విజ్ఞతతో ఆలోచించి మాట్లాడాలన్నారు.

నియమావళిని ఉల్లఘించారు..

ప్రత్యర్థి పార్టీవారు ఎన్నికల నియమావళిని పూర్తిగా ఉల్లంఘించారని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులకు, జనరల్ ఏజెంట్లకు మాత్రమే ఒక వాహనానికే పాసులు ఇస్తారన్నారు. అందులో పాసులు పొందిన వారు మాత్రమే తిరగాలన్నారు. అలా కాకుండా ప్రతి మండలంలో కాన్వాయ్ వాహనాలు పెట్టడం, పోలింగ్ బూత్‌లలోకి వెళ్లి దౌర్జన్యాలు చేయాలని ఆలోచనలు చేయడం చాలా దురదృష్టకరమన్నారు. రాయచోటి నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో పోలీసు వ్యవస్థ దీన్ని ఎందుకు అరికట్టలేక పోయిందో అర్థం కాలేదన్నారు. ప్రజలు తమవైపు ఉన్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు భావించి సంయమనం పాటించి ప్రజాస్వామ్యాన్ని గెలిపించారన్నారు. రాయచోటి మండలంలోని నక్కావాండ్లపల్లె, లక్కిరెడ్డిపల్లి మండలంలోని చౌటపల్లి తదితర ప్రాంతాలలో బూత్‌లలోకి వెళ్లి ఘర్షణలకు దిగడం, మరికొన్ని బూత్‌లలోకి వెళ్లి మహిళలపై అసభ్య పదజాలాన్ని వాడటం చాలా బాధాకరమన్నారు. ఎన్నికల తరువాత వీళ్లకు తెలియజేస్తున్నా.. రాజకీయాలలో విలువలు చాలా ముఖ్యం. ఓర్పు, సహనం చాలా అవసరమన్నారు. ప్రజాస్వామ్యాన్ని గెలిపించే విధంగా ఉండాలే కానీ, అపహాస్యం చేసేలా ఏ ఒక్కరూ వ్యవహరించకూడదన్నారు. ఫేక్ వీడియోలు సృష్టించిన వారిపై క్రైమ్ పోలీసులు ఛేదిస్తున్నారని, తప్పు చేసిన వారిని వదలమన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


కార్యకర్తలతో మాట్లాడుతున్న జీవీ సుబ్బారెడ్డి

నందలూరు(రాజంపేట) : సార్వత్రిక ఎన్నికల్లో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని నందలూరు మండల ఇన్‌చార్జ్ గడికోట వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందలూరు మండలంలో ప్రతి కార్యకర్త ఆకేపాటి అమరనాథరెడ్డి ఎమ్మెల్యే కావాలని తమ శక్తివంచన లేకుండా కృషి చేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు మళ్లీ కొనసాగాలంటే ఈనెల 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో మహిళలు పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొని ఫ్యాను గుర్తుకు ఓటువేసి జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని మహిళలు కోరుకుంటున్నారని అన్నారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నికల్లో కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. నందలూరు మండలంలో ఆకేపాటి అమరనాథరెడ్డికి దాదాపు 5 వేలు పైచిలుకు మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి, పాటూరు, నందలూరు నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో సబ్సిడీ విత్తనాలు

ఒంటిమిట్ట : మండలానికి పచ్చిరొట్టి విత్తనాలు, జీలుగలు 100 క్వింటాళ్లు, జనుములు 24 క్వింటాళ్లు వచ్చాయని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. విత్తనాలు అవసరమున్న రైతులు రైతు భరోసా కేంద్రాలలో ఈనెల 16వ తేదీ నుంచి 21వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకొని డబ్బులు చెల్లిస్తే 23వ తేదీ నుంచి విత్తనాలను పంపిణీ చేస్తామని చెప్పారు. జీలుగలు అసలు ధర కేజీ రూ. 88లు ఉండగా 50 శాతం సబ్సిడీ పోను రూ. 44లు, జనుములు అసలు ధర కేజీ రూ. 88లు ఉండగా 50 శాతం సబ్సిడీతో రూ. 44లు చెల్లించి పొందవచ్చన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సూచించారు.

డెంగీ నివారణలో భాగస్వామ్యులు కావాలి



అవగాహనా పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

పోస్టర్ల విడుదలలో డీఎంఅండ్‌హెచ్‌ఓ

రాయచోటి అర్బన్ : డెంగీ నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని డిఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం డీఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వైద్య ఆరోగ్యశాఖ జేడీ దేవసాగర్, జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ లతో కలసి డెంగీ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధి నివారిద్దాం అనే నినాదంతో ముందుకు వెళుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డెంగీ వ్యాధి ఈడిస్ దోమ, టైగర్ ఆడ దోమ ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో తిరుగుతూ డెంగీ వ్యాధి, నివారణల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల లార్వా వృద్ధి చెందకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డెంగీ నిర్ధారణ అయిన గ్రామాల్లో వెంటనే పైరేత్రియం, స్ప్రేయింగ్, ఫాగింగ్‌లు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమలబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటూ సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ శైలజ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి ఉషశ్రీ, మలేరియా సబ్ యూనిట్ అధికారులు ప్రసాద్‌యాదవ్, జయరామయ్య, సీహెచ్‌ఓలు నారాయణ, రామక్రిష్ణలు, అధికారులు బలరామరాజు, సరళ, శివారెడ్డి, పెంచలయ్య, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవం


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి


ఊరేగింపులో కళా ప్రదర్శనను ప్రదర్శిస్తున్న దృశ్యం

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీలోని కొండమూల గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఉత్సవాలు వైభవంగా ముగిసినట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. అమ్మవారిని అలంకరించి సింహవాహన ప్రభతో వాయిద్యములతో, గంధ సింధూర పుష్పాదులతో శోభాయమానంగా అలంకరించి అమ్మవారిని ఊరేగించారు. ఊరేగింపు సందర్భంగా గ్రామంలో బాణసంచా పేలుళ్లు, బళ్లారి డ్రమ్స్, కేరళ వాయిద్యములతో శ్రీ తొగటవీర క్షత్రియులచే మేలుకొలుపు పద్యములతో కనుల పండువగా పుష్పపల్లకీలో అమ్మవారిని ఊరేగించారు. బుధవారం ఉదయం 5 గంటలకు అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున తొగట వీరక్షత్రియ సంఘం కుటుంబసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సాహిత్యం, చరిత్రలతో జిల్లా ప్రతిష్టను పెంచిన 'కట్టా'


విద్వాన్ కట్టా నరసింహులు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

కడప కల్చరల్ : విద్వాన్ కట్టా నరసింహులు కైఫీయత్తుల పరిష్కారం ద్వారా మరుగున పడిన గొప్ప చరిత్రను వెలికితీసి జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేశారని వైవీయూ పాలక మండలి సభ్యులు, వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. బ్రౌన్ గ్రంథాలయ తొలి బాధ్యులు, కడప కైఫీయత్తుల పరిష్కర్త విద్వాన్ కట్టా నరసింహులు 3వ వర్ధంతిని పురస్కరించుకొని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు ఆధ్వర్యంలో బుధవారం ఆయన సంస్మరణ సభను నిర్వహించింది. తొలుత కట్టా చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు.

18న వాసవీమాత జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఈ నెల 18న శ్రీ వాసవీ మాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు మహాప్రాకారోత్సవం, అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందన్నారు. సాయంత్రం 7 గంటలకు 102 మంది ఆర్యవైశ్య సుహాసినులతో లక్షకుంకుమార్చన జరుగుతుందని పేర్కొన్నారు.

వేలం ద్వారా ఆదాయం

రాజుపాళెం : వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాలకు సంబంధించి తలనీలాల వేలంపాట ద్వారా రూ.13.08 లక్షల ఆదాయం వచ్చినట్లు దేవస్థానాల చైర్మన్ బుక్కసముద్రం జగదీశ్వర రెడ్డి, ఆలయ ఈఓ బీవీ నరసయ్య తెలిపారు. వెల్లాలలోని సంజీవరాయ కల్యాణ మండపంలో బుధవారం తలనీలాల వేలంపాటను చైర్మన్, ఈఓ, పర్యవేక్షణాధికారి ఆర్‌ఆర్ నరసింహ సింగ్ అధ్యక్షతన వేలంపాటను నిర్వహించారు.

అధికారం వైఎస్సార్‌సీపీదే

కడప కార్పొరేషన్: అధికారం చేపట్టేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే అని ఆ పార్టీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ విశ్వాసం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి ప్రవాసాంధ్రులు మేయర్ సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ కడప అసెంబ్లీ అభ్యర్థి ఎస్‌బి అంజద్‌బాషా, కమలాపురం అసెంబ్లీ అభ్యర్థి పి. రవీంద్రనాథ్‌రెడ్డిలను వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా ఇలియాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో 135 అసెంబ్లీ స్థానాలతో జగనన్న రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని తెలిపారు. పులివెందుల్లో తాను గెలుస్తానని టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బీటెక్ రవి చెప్పడం అతిపెద్ద జోక్ అన్నారు. కడపలో టీడీపీ అభ్యర్థి మాధవి మతాల మధ్య చిచ్చు రేపి గెలవాలని ప్రయత్నించారని, పరమత సహనానికి మారుపేరైన కడప ప్రజలు ఆమెకు బుద్ధిచెప్పబోతున్నారన్నారు. సౌమ్యుడు, అందరివాడు అయిన అంజద్‌బాషా హ్యాట్రిక్ కొట్టబోతున్నారన్నారు. గల్ఫ్ దేశాల నుంచి వచ్చి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం కోసం పని చేసిన ప్రవాసాంధ్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

క్షయ నివారణకు టీకాలు తప్పనిసరి


సిబ్బందికి సలహాలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ కొండయ్య, లెప్రసీ జేడీ దేవసాగర్‌లు

సంబేపల్లె : క్షయవ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ అడల్ట్ బీసీజీ టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని డీఎం అండ్ హెచ్‌ఓ కొండయ్య, లెప్రసీ జాయింట్ డైరెక్టర్ దేవసాగర్‌లు తెలిపారు. బుధవారం సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారు ఆకస్మిక తనిఖీ చేశారు. క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యంగా టీకాలను ప్రజలకు అందించాలని తెలియజేశారు. క్షయ నిర్మూలనకు ప్రతి గురువారం వేసే టీకాల ఏర్పాట్లను వారు పరిశీలించారు. దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సునీల్ కుమార్ నాయక్ నేటి నుంచి ఈ వ్యాక్సిన్‌ను వేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సూర్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు


ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీంతో ఆలయాన్ని రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. 16న ఉదయం మూలవర్లకు, ఉత్సవ విగ్రహములకు తిరుమంజనసేవ, సాయంత్రం విశ్వక్సేనుడు ఆరాధన, అంకురార్పణ, రక్షాబంధనం జరుగుతుందని ఆలయ ఈఓ రమణ తెలిపారు. 17న ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, 18న ఉదయం అభిషేకం, హోమం, సాయంత్రం సింహవాహనం, హనుమంతవాహనం, 19న ఉదయం అభిషేకం, హోమం, సాయంత్రం చిన్నశేష వాహనం, గజవాహనం, 20న ఉదయం అభిషేకం, సాయంత్రం హంసవాహనం, పెద్ద శేషవాహనంపై ఊరేగింపు నిర్వహిస్తారు. 21న ఉదయం అభిషేకం, హోమం, సాయంత్రం సర్వభూపాల వాహనం, 22న ఉదయం అభిషేకం,హోమం, సాయంత్రం మోహిని ఉత్సవం(కల్పవృక్షవాహనం), 23న ఉదయం అభిషేకం, హోమం, సాయంత్రం శ్రీవారి కళ్యాణం , రాత్రి గరుడోత్సవం, 24న ఉదయం అభిషేకం, హోమం, ఉదయం 9.30 నుంచి 10.30 వరకు మడుగుతేరు (బ్రహ్మరథోత్సవం) ఉంటుందన్నారు. 25న ఉదయం అభిషేకం, హోమం, వసంతోత్సవం, చక్రస్నానం, సాయంత్రం అశ్వవాహనం,ధ్వజ అవరోహణం, 26న అభిషేకం, హోమం, స్నపన తిరుమంజనం, సాయంత్రం ఉంజల్‌సేవ, రాత్రి శయనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

గుర్తు తెలియని మృతదేహానికి అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు

మదనపల్లె సిటీ: స్థానిక వారపుసంతలో బస్సు ఢీకొని దుర్మరణం పాలై, గుర్తించలేక పోయిన మృతదేహానికి బుధవారం హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు మానవతా దృక్పథంతో అంత్యక్రియలు నిర్వహించారు. చనిపోయిన వ్యక్తి బంధువులు ఎవరూ రాకపోవడంతో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు ముందుకు వచ్చారు. మృతిడి చేతిపై త్రిశూలం పచ్చబొట్టు ఆధారంగా హిందువుగా గుర్తించి సంస్థ సభ్యులు చందాలు వేసుకుని హిందూ సంప్రదాయ ప్రకారం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్, సభ్యులు ఆనంద్, బావజాన్, ఇలియాజ్, శశి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మిచాంగ్ బాధితులను ఆదుకోవాలి

పుల్లంపేట : మిచాంగ్ తుఫాను వల్ల నష్టపోయిన రైతులకు త్వరగా నష్టపరిహారం మంజూరు చేయాలని మండలంలోని రైతులు కోరుకుంటున్నారు. పంట చేతికందే సమయానికి ప్రకృతి కన్నెర్ర చేయడంతో తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. కావున సంబంధిత అధికారులు స్పందించి త్వరగా నష్టపరిహారం మంజూరు చేయాలని మండల రైతులు కోరుకుంటున్నారు.

రాయచోటిలో 77.38 శాతం పోలింగ్

రాయచోటి : సార్వత్రిక ఎన్నికలలో భాగంగా రాయచోటి నియోజకవర్గంలో ఈనెల 13వ తేదీ జరిగిన పోలింగ్ సందర్భంగా 1,97,463 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో రాయచోటి మున్సిపాలిటీ, రూరల్, చిన్నమండెం, సంబేపల్లె, రామాపురం, లక్కిరెడ్డిపల్లి, గాలివీడు మండలాల్లో 2,55,168 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో లక్కిరెడ్డిపల్లెలో 1 నుంచి 33 పోలింగ్ కేంద్రాలలో 26755 మంది ఓటర్లు ఉండగా 22019 మంది ఓట్లు వేయడంతో 82.52 శాతం పోలింగ్ నమోదైంది. రామాపురంలో 32 (34–65) పోలింగ్ కేంద్రాలలో 26608 మంది ఓటుహక్కు వినియోగంతో 82.91 శాతం పోలింగ్ నమోదైంది. రాయచోటి రూరల్ మండలంలో 31 (66–86, 171–180) పోలింగ్ కేంద్రాలలో 26775 మంది ఓటర్లు ఉండగా 21217 మంది ఓటుహక్కు వినియోగంతో 79.24 శాతం, రాయచోటి మున్సిపాల్టీలో 84 (87–170) పోలింగ్ కేంద్రాలలో 79043 మంది ఓటర్లు ఉండగా 52777 మంది ఓటుహక్కు వినియోగంతో 66.76 శాతం ఓట్లు పోలయ్యాయి. గాలివీడు మండలంలో 44 (181–224) పోలింగ్ కేంద్రాలలో 40229 మంది ఓటర్లు ఉండగా 32809 మంది ఓటుహక్కు వినియోగంతో 81.55 శాతం, చిన్నమండెంలో 32 (225–256) పోలింగ్ కేంద్రాలలో 26697 మంది ఓటర్లు ఉండగా 22478 మంది ఓటు వేయడంతో 84.19 శాతం ఓట్లు పోలయ్యాయి. సంబేపల్లెలో 36 (257–292) పోలింగ్ కేంద్రాలలో 29061 మంది ఓటర్లు ఉండగా 24040 మంది ఓటు వేయడంతో 82.72 శాతం ఓట్లు పోలయ్యాయి.

19 నుంచి ఉలవల గంగమ్మ తిరునాల


ఉలవల గంగమ్మ ఆలయం


ఆలయంలో వెలసిన గంగమ్మ విగ్రహం

పీలేరు రూరల్: మండలంలోని తలపుల గ్రామంలో వెలసిన శ్రీ ఉలవల గంగమ్మ తిరునాల ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు మల్లికార్జున నాయుడు, సాగర్ రెడ్డి తెలిపారు. 19న ఉదయం 8 గంటలకు అమ్మవారి అభిషేకం, కళశపూజ, నవగ్రహ పూజ, రాత్రి మదనపల్లికి చెందిన విజయలక్ష్మీ నాట్యకళామండలి వారి ఆధ్వర్యంలో బాలనాగమ్మ నాటక ప్రదర్శన జరుగుతుందని, 20 తేదీ మధ్యాహ్నం తిరుపతికి చెందిన భాగవతారిణి వారిచే హరికథా కాలక్షేపం, సాయంత్రం అమ్మవారి ఊరేగింపు, రాత్రి ఆసాదివార కథ, కోలాటం, చెక్క భజనలు, చాందినీ బండ్ల ఊరేగింపు ఉంటుందని తెలిపారు. 21న మంగళవారం ఉదయం అమ్మవారికి దీలు బోనాల సమర్పణ జరుగుతుందని వారు తెలిపారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు

మదనపల్లె సిటీ: స్థానిక కదిరిరోడ్డులోని శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధన మహోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఆలయంలో వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నవగ్రహారాధన, పంచామృతాభిషేకం, నవగ్రహ హోమం నిర్వహించారు. సాయంత్రం భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు లక్ష్మీ నారాయణాచారి, ఆలయ అర్చకులు వీరబ్రహ్మాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.